దివ్యాస్త్రాలు సంపాదిస్తే సరిపోదు.. వాటిని యుక్తిగా ప్రయోగించే నేర్పూ, ఓర్పూ రెండూ ఉండాలి. నేటి యుగంలో సోషల్ మీడియాను మించిన బ్రహ్మాస్త్రం లేదు. దీన్ని సంధించిన తర్వాత ఉపసంహరించడం ఉండదని గుర్తుంచుకోవాలి. ఆగ్రహావేశాలకు గురై ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తే.. మహాభారతంలో అశ్వత్థామలా అపకీర్తిని మూటగట్టుకోక తప్పదు. తెలివితేటలు ఉన్నా విషయంపై స్పష్టత కొరవడితే.. సవ్యసాచి కుడియెడమైన తీరుగా తయారవుతుంది పరిస్థితి. ఎక్కడ తగ్గాలో తెలియాలి, ఎక్కడ నెగ్గుతామో తెలుసుకోవాలి. ఇంతకీ సామాజిక మాధ్యమాల్లో ఎక్కుపెట్టే అక్షర తూణీరాలు ఎలా ఉండాలంటే..



టెక్ టాక్

# మాట..చేటు కానివ్వకండి

'ఇంటిని చూసి ఇల్లాలిని చూడు' అన్నది పాత సామెత. ఒక మనిషి గుణగణాలు, వ్యవహారశైలి ఆ వ్యక్తి సోషల్ మీడియా అకౌంట్లు చూసి కనిపెట్టొచ్చు. సరదాగా పెట్టే స్టేటస్ కూడా మన పర్సనాలిటీని డిసైడ్ చేస్తుంది. చేసే పోస్టులు, పెట్టే కామెంట్లు, షేరింగ్‌లు వీటితోపాటు అకౌంట్ మేనేజ్‌మెంట్ కూడా చాలా కీలకం. అదేపనిగా వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేస్తూ పోకండి. వాటి ఆధారంగా మీ ఆనుపానులు తెలుసుకొని, ఇతర అవసరాలకు ఉపయోగించుకునే ప్రమాదం లేకపోలేదు.

**ఇలా ఉండకండి..**

- మీ జీవనానికి సోషల్ మీడియా ప్రతిబింబం కాదని గుర్తుంచుకోవాలి. అందులో కనిపించేవన్నీ అద్భుతమైనవని భావించొద్దు. సోషల్ మీడియా రివ్యూల ఆధారంగా రెస్టారెంట్ ఎంచుకోవడం, అందులో పోస్ట్ చేసే వీడియోలను చూస్తూ వర్కవుట్లు చేయడం వంటి పొరపాట్లు చేయొద్దు.
- హాస్యం శ్రుతిమించితే సమస్యలు చుట్టుముడుతాయి. మీకు కామెడీగా అనిపించిన విషయాన్ని ఎదుటివారు సీరియస్‌గా భావించొచ్చు. ఏదైనా సరదా విషయాలు షేర్ చేయాల్సి వచ్చినప్పుడు.. అది ఎవరినైనా కించపరిచేలా ఉందో, లేదో చెక్ చేసుకోండి.
- ఎడాపెడా వచ్చే నోటిఫికేషన్ టోన్లు విసుగు తెప్పిస్తుంటాయి. ఆ వచ్చిన అన్నిటినీ చూస్తూ పోతే... అదొక వ్యసనంగా మారే ప్రమాదమూ ఉంది. ఆఫర్ల నోటిఫికేషన్ల మాయలో పడితే.. ఆన్‌లైన్ షాపింగ్ శ్రుతిమించి, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవ్వొచ్చు
- విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులకు, గ్రూప్‌లకు దూరంగా ఉండటం చాలా అవసరం. దీనివల్ల ఒక్కోసారి వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది.
- సోషల్ మీడియా అకౌంట్ల వాడకం అంతా స్మార్ట్‌ఫోన్ లోనే సాగుతుంది. ఫోన్ నిరంతరం అందుబాటులో ఉండటం వల్ల.. గడికోసారి వివిధ సామాజిక మాధ్యమాల్లోకి వెళ్లి తొంగి చూడటం, తోచింది పోస్ట్ చేయడం... ఇలా కాలక్షేపం పేరుతో చాలామంది సమయాన్ని వృథా చేసుకుంటున్నారు.

**పర్సనల్‌గా వద్దు**

- సోషల్ మీడియాలో ఫ్రెండ్ రిక్వెస్ట్స్ ఇబ్బడిముబ్బడిగా వస్తుంటాయి. అందరినీ ఓకే చేయొద్దు. మీ కెరీర్‌కు, వ్యక్తిగత జీవితానికి పనికొచ్చే వ్యక్తుల రిక్వెస్ట్స్ మాత్రమే యాక్సెప్ట్ చేయాలి.
- స్నేహితుడి లిస్ట్‌లో ఉన్నాడని ఫ్రెండ్ రిక్వెస్ట్ యాక్సెప్ట్ చేస్తుంటారు కొందరు.



సామాజిక మాధ్యమాల్లో కామన్ ఫ్రెండ్స్ అన్నంత మాత్రాన అభిప్రాయాలు కలిశాయని గుడ్డిగా నమ్మొద్దు. అలాంటి వ్యక్తుల నుంచి రిక్వెస్ట్ వస్తే ప్రొఫైల్ చెక్ చేశాక గానీ యాక్సెప్ట్ చేయొద్దు.

- ప్రొఫైల్‌లో గానీ, ఆ వ్యక్తి గతంలో చేసిన పోస్టులో గానీ అసంబద్ధమైన విషయాలు ఉంటే.. రిక్వెస్ట్ ఇగ్నోర్ చేయండి. అప్పటికే ఫ్రెండ్ అయినప్పటికీ.. విపరీత ధోరణితో పోస్టులు పెడుతుంటే... పోస్టులు బ్లాక్ చేయడం, ఆ వ్యక్తి అకౌంట్‌ను అన్‌ఫాలో కావడం గానీ చేయండి.
- దగ్గరి వ్యక్తులతో కొన్నిసార్లు స్నేహం చెడొచ్చు. మీపై కోపంతో ఆ వ్యక్తి సామాజిక మాధ్యమాల్లో మిమ్మల్ని అన్‌ఫ్రెండ్ చేయొచ్చు. దాన్ని పర్సనల్‌గా తీసుకొని ఏదో జరిగిపోయిందని వ్యాసాలు రాయాల్సిన పని లేదు. మీ వ్యక్తిగత విషయాన్ని పదిమందితో పంచుకోవాల్సిన అవసరం లేదు.
- ఏదైనా విషయంపై వాదోపవాదాలకు దిగకండి. మీ అభిప్రాయాన్ని చెప్పి ఊరుకుంటే సరి. దానిపై చర్చోపచర్చలు కొనసాగించాల్సిన అవసరం లేదు.
- దేనిపైన అయినా స్పందించాల్సి వస్తే.. స్పష్టమైన అవగాహనతో సద్విమర్శ చేయండి. గాలివార్తల ఆధారంగా వాదన వినిపిస్తానంటే అసలుకే ఎసరొస్తుంది.
- మీ వివరణకు హేతుబద్ధత ఉండేలా చూసుకుంటే.. ఏ సమస్యా రాదు. అవతలి వ్యక్తులు అసంబద్ధంగా కామెంట్లు చేస్తే.. వాటి జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. ఈ సూత్రాలు పాటిస్తే.. సామాజిక మాధ్యమాల్లో మర్యాద రామన్న అనిపించుకోవచ్చు. ■

## ట్రోల్స్ కంట్రోల్‌లో ఉండవు

- ప్రతి విషయంపైనా తగుదునమ్మా అని స్పందించాల్సిన అవసరం లేదు.
- ఎవరో పెట్టిన పోస్టుకు ఊగిపోతూ వ్యాఖ్యానాలు రాయాల్సిన పన్లేదు.
- బాడీ షేమింగ్, మతాన్ని, కులాన్ని కించపరిచేలా పోస్టులు పెడితే ట్రోలర్స్ బారిన చిక్కినట్టే.
- సున్నితమైన అంశాలు, కోర్టు తీర్పులు, ప్రభుత్వ నిర్ణయాలను తూర్పారబడుతూ పోస్టులు పెట్టి ఏదో సాధించామని భావిస్తే అంతకన్నా అమాయకత్వం మరొకటి ఉండదు. వాటిని సమర్థించే వ్యక్తులు చేసే ట్రోల్స్ ఊపిరి ఆడనంత పనిచేస్తాయని మర్చిపోవద్దు.




**అనిల్ రాచమల్ల**
వ్యవస్థాపకులు
ఎండ్‌నౌ ఫౌండేషన్